# అదుపుతప్పి పల్టీ కొట్టిన కారు



ప్రమాదంలో మృతిచెందిన బానోతు శ్రీరామ్(ఫైల్‌ఫోటో)

## గచ్చిబౌలిలో ఘోర రోడ్డు ప్రమాదం

### విద్యార్థి మృతి ● మరో నలుగురు విద్యార్థులకు గాయాలు

ఉదయం వేళ సూర్యోదయాన్ని చూసేందుకు కారుతో బయటకు వచ్చిన స్నేహితులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఇండస్ట్రీయల్ టూర్ కోసం నగరానికి వచ్చి స్నేహితులతో కలిసి సరదాగా గడుపుతూ అనుకోని ప్రమాదంతో మృత్యుఒడికి చేరాడు ఇందులో ఓ స్నేహితుడు. మరో నలుగురు స్నేహితులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒకే కళాశాలలో చదువుతున్న స్నేహితులు సరదా కోసం కారు తీసుకొని బయటకు వచ్చి, మితిమీరిన వేగంతో కారు నడపడం, పిల్లి అడ్డు వచ్చిందని సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పిన కారు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి మృతిచెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖాజాగూడ లేక్ రోడ్డుపై జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం..

గచ్చిబౌలి, డిసెంబరు 22 ప్రభాతవార్త : ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం ఎర్రగడ్డ తాండాకు చెందిన బానోతు రామో మ్రహన్, వినోద దంపతుల కుమారుడు బానోతు శ్రీరామ్(20) జోగిపేటలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఇదే కళాశాలలో చందానగర్ గంగారంకు చెందిన కె.ఉదయ్ సాయి(18), మణికొండకు చెందిన దితేష్((17), రామాయంపేటకు చెందిన వర్షిత్(18), నారాయణఖేడ్‌కు చెందిన వంశీ(18)లు సైతం ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. కాగా వీరు ఐదుగురు స్నేహితులు ఇండస్ట్రీయల్ టూర్ కోసం ఇతర క్లాస్‌మేట్స్‌తో కలిసి నగరానికి వచ్చారు. గురువారం రాత్రి మణికొండలో ఉన్న దితేష్ ఇంట్లో ఉన్నారు. శుక్రవారం తెల్లవారు జామున ఖాజా గూడ పెద్ద చెరువు గుట్ట మీదనుంచి సూర్యోదయాన్ని చూసేందుకు ఎకో స్పోర్ట్స్ కారు(టిఎస్07 ఎఫ్‌డి3618)లో బయలుదేరారు. ఖాజాగూడ పెద్దచెరువు వద్ద కొద్దిసేపు ఫోటోలు దిగి, సరదాగా గడిపిన అనంతరం లేక్ రోడ్డు మీదుగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ వైపు బయలుదేరారు. కారును ఉదయ్ సాయి నడుపుతుండగా, లేక్ రోడ్డు మీద మితిమీరిన వేగంతో వచ్చిన కారు అదుపుతప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా చెట్టును, పక్కనే ఉన్న బండరాయిని ఢీకొట్టిన కారు అవతలి రోడ్డు మీదకు వచ్చి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సీటు పక్కనే కూర్చున్న బానోతు శ్రీరామ్ కారు పల్టీ కొట్టే సమయంలో ఎగిరి కిందపడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నడుపుతున్న ఉదయ్ సాయి, వెనుక సీట్లో కూర్చున్న దితేష్, వర్షిత్, వంశీలకు సైతం గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతిచెందిన శ్రీరామ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి అతివేగంగా కారు నడుపడమే కారణమని పోలీసులు భావిస్తుండగా, పిల్లి ఎదురు రావడంతో సడన్ బ్రేక్ వేసిన కారణంగానే ప్రమాదం చోటు చేసుకుందని ఉదయ్ సాయి విచారణలో తెలిపాడు. కాగా ఈ కారు పల్టీ కొట్టే సమయంలో ఎదరుగా ఎటువంటి వాహనాలు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. డ్రైవింగ్ చేసిన ఉదయ్‌సాయికి లైసెన్స్ ఉందా లేదా అనే విషయంలో విచారణ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. చనిపోయిన శ్రీరామ్ కుటుంబ సభ్యుల రోధన కంటతడి పెట్టించింది. ఈమేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

హైదరాబాద్ వార్త



# అన్నీ సిద్ధం చేశాం

- ▼ కొవిడ్ ఒమిక్రాన్ జేఎన్ 1 పట్ల జాగ్రత్తలు పాటించాలి
- ▼ దీర్ఘకాలిక రోగులు, పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు జాగ్రత్తగా ఉండాలి
- ▼ గాంధీ ఆస్పత్రిలో వైద్యం కోసం అన్ని ఏర్పాట్లు చేసిన వైద్యులు





సికింద్రాబాద్, డిసెంబర్ 22 ప్రభాతవార్త: కరోనా మళ్లి విస్తరిస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని తీవ్రంగా భయాందోళనలు చెందుతున్నారు. రెండు సంవత్సరాలుగా కరోనాను మరిచిపోయిన ప్రజలు మళ్లీ కరోనా పేరును వింటేనే భయపడుతున్నారు. నాలుగైదు రోజులుగా కరోనా మళ్లి విస్తరిస్తుందని, జాగ్రత్తగా ఉండాలని పలు మాధ్యమాలలో వింటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కరోనా మళ్లి విజృంభించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. గత రెండు సంవత్సరాలలో కరోనా ఒమిక్రాన్ వచ్చినప్పటికి పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. అయినప్పటికి వైద్యులు ముందస్తుగానే అనేక చర్యలు తీసుకున్నారు. అవసరమైతే ఎలాంటి చర్యలకైనా సిద్ధపడ్డారు. ఆక్సీజన్, బెడ్‌లు ఇతర అవసరమైన ఏర్పాట్లు జరిపారు. వైద్యులు చెప్పినట్లుగానే ఒమిక్రాన్ పెద్దగా ప్రభావం చూపలేదు. కాని వారం రోజులుగా కరోనా ఒమిక్రాన్‌కు చెందిన సబ్ వేరియంట్ జేఎన్ 1 విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. టీబీ, క్యాన్సర్, షుగర్, బీపీ ఉన్నవారే కాకుండా గర్భిణీలు, పిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలంటున్నారు. అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతున్న ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్ 1 మరీ ప్రాణాంతకమైనది కాకపోయినా ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని చెబుతున్నారు.

**లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు..** కరోనా ఒమిక్రాన్‌కు చెందిన సబ్ వేరియంట్ జేఎన్ 1 విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అత్యంత వేగంగా విస్తరిస్తున్నందున పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. జేన్ 1 లక్షణాలలో దగ్గు, జ్వరం, జలుబు, ఒంటినొప్పులు ఉంటాయని, ఈ లక్షణాలు కనిపిస్తే సాధ్యమైనంత తొందరగా కరోనా పరీక్షలు జరిపించుకోవాలని వైద్యులు చెబుతున్నారు. అంతకంటే ముందు కరోనా రాకుండా ఉండడం కోసం సాధ్యమైనంత వరకు ఇతరులకు దూరంగా ఉండాలని, బహిరంగ ప్రదేశాల్లో కూడా మస్కులు ఖచ్చితంగా ధరించాలని, జనసమ్మర్థం ఉన్న ప్రాంతాల్లో తప్పనిసరిగా డిస్టెన్స్ పాటించడంతో పాటు మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు. శానిటైజర్‌ను వినియోగించాలంటున్నారు. బయటి తినుబండారాలు కాకుండా ఫ్రెష్‌గా, వేడిగా ఉన్న వాటిని తీనటం మంచిదంటున్నారు. ముఖ్యంగా క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలలో జాగ్రత్తగా ఉండాలి. వైరస్ ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంది.

**గాంధీ ఆస్పత్రిలో అన్ని ఏర్పాట్లు..**

కోవిడ్ వస్తే వైద్యం అందించడం కోసం గాంధీఆస్పత్రి వైద్యులు అన్ని ఏర్పాట్లు జరిపారు. కోవిడ్ అల్ఫా, డెల్టా కంటే వేగంగా విస్తరించే కోవిడ్ ఒమిక్రాన్ జెన్ 1 వైరస్ సోకిన వారికి అత్యుత్తమైన వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంలో కోవిడ్ వచ్చినప్పుడు ఏర్పాటు చేసిన కోవిడ్ ఐసోలేషన్ వార్డులో 50 పడకలు సిద్ధంగా ఉంచారు. పురుషులకు 30, మహిళలకు 20 పడకలు అందుబాటులో ఉన్నాయి. కోవిడ్ పరీక్షలు జరుపడంతో పాటు పీపీఈ కిట్లు, వ్యాక్సినేషన్ కూడా అందుబాటులో ఉంచారు.



**అన్ని సిద్ధం చేశాం.. ఆందోళన అవసరం లేదు : గాంధీ ఆస్పత్రి డాక్టర్ సూపరింటెండెంట్ రాజారావు**

కోవిడ్ ఒమిక్రాన్ జెన్ 1 వేరియంట్ పట్ల అప్రమత్తత అవసరం. ముఖ్యంగా దీర్ఘ కాలిక రోగులు, టీబీ, క్యాన్సర్, షుగర్, బీపీ ఉన్నవారే కాకుండా గర్భిణీలు, పిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలి. జేఎన్ 1 సబ్ వేరియంట్ సెల్ఫ్ లిమిటింగ్ వైరస్. దానంతట అదే తగ్గిపోతుంది. కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేకపోయినా జాగ్రత్తలు పాటించడం అవసరం. గాంధీలో క్యాజువాలిటీ మేయిన్ బిల్డింగ్‌లోని లేబర్ వార్డులో ఐసోలేషన్ వార్డులు సిద్ధంగా ఉన్నాయి. కోవిడ్ కేలుసు పెరిగితే గాంధీ మెడికల్ కాలేజీ వైరాలజీ ల్యాబ్‌లోనే జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షలు నిర్వహించే ఏర్పాటు జరిగాయి.

# వాహనదారులకు గుడ్‌న్యూస్



- ట్రాఫిక్ చలాన్లపై మరోసారి భారీ డిస్కౌంట్..!
- ఆర్టీసి డ్రైవర్స్, తోపుడు బండ్లవారికి 90శాతం
- టూవీలర్ చలాన్లకు 80 శాతం
- ఫోర్ వీలర్స్, ఆటోలకు 60 శాతం
- లారీలతో పాటు ఇతర హెవీ వెహికిల్స్‌కి 50 శాతం డిస్కౌంట్



హైదరాబాద్, డిసెంబరు 22 ప్రభాతవార్త : మీ బైక్, కార్లకు చలాన్లు ఉన్నాయా..వేలకు వేల రూపాయలు ఎలా కట్టాలని బాధపడుతున్నారా..డోంట్ వర్రీ..వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు అదిరిపోయే శుభవార్త చెప్పారు. పెండింగ్ చలాన్ల క్లియరెన్స్ స్కీమ్ తీసుకొచ్చింది. పెండింగ్ చలానాలపై భారీ డిస్కౌంట్ ప్రకటించింది. టూవీలర్స్‌పై 80 శాతం, ఫోర్ వీలర్స్, ఆటోలపై 60 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. లారీలతో పాటు ఇతర భారీ వాహనాలపై పెండింగ్ చలానాలో 50 శాతం తగ్గింపు ఇచ్చింది. ఆర్టీసి డ్రైవర్లు, తోపుడు బండ్ల వారికి 90 శాతం డిస్కౌంట్ ఇచ్చింది. వంద రూపాయలకు పది రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. ఈనెల 26వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు డిస్కౌంట్ చలానాల చెల్లింపునకు అవకాశం కల్పించారు.చలాన్లను ఆన్‌లైన్‌తో పాటు మీ సేవ కేంద్రాల్లో కూడా చెల్లించవచ్చు. గత ఏడాది పెండింగ్ చలాన్లపై రాయితీ ఇవ్వగా..ఫైన్లు కట్టేందుకు వాహనదారుల నుంచి భారీగా ఎగబట్టారు. రాయితీ ఉన్న టైంలో దాదాపు 300 కోట్ల రూపాయల వరకు పెండింగ్ చలాన్లు వసూలు అయ్యాయి. గతేడాది మార్చి 31వ తేదీ నాటికి రాష్ట్రంలో మొత్తం 2.4 కోట్ల చలానాలు పెండింగ్‌లో ఉంటే..వీటిని వసూలు చేసేందుకు భారీ ఆఫర్ ప్రకటించారు. బైక్‌లపై 75శాతం, మిగిలిన వాటికి 50 శాతం రాయితీ ఇచ్చారు. దీనికి అనూహ్య స్పందన వచ్చింది. దీంతో వాహనదారులు నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. పెండింగ్ చలానాలు చెల్లించేందుకు జనం ఎగబ్టారు. 45 రోజుల వ్యవధిలోనే దాదాపు రూ.300 కోట్లు పెండింగ్ చలాన్లు వసూలు అయినట్లు పోలీసు శాఖ తెలిపింది.దాదాపు 65 శాతం చలానాలు చెల్లించారు. ఆ తర్వాత మళ్లీ పెండింగ్ భారీ పెరిగిపోతోంది. గత నెలాఖరుకు చనాలా సంఖ్య మళ్లీ రెండు కోట్లకు చేరుకుందని అంచనా.

### నీలోఫర్ ఆసుపత్రిలో కరోనా కలకలం

## 14 నెలల బాలుడికి పాజిటివ్

మెహిదీపట్నం, డిసెంబర్ 22, ప్రభాతవార్త : నాంపల్లి ఆగాపుర ప్రాంతానికి చెందిన 14 నెలల బాలుడికి కోవిడ్ సోకింది. నాలుగైదు రోజుల క్రితం తీవ్రమైన జ్వరం, ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతుండడంతో బాలుడి తల్లిదండ్రులు నిలోఫర్ ఆసుపత్రికి వెంటిలేటర్ పై తీసుకొచ్చారు. అనుమానం వచ్చిన అధికారులు కొవిడ్ పరీక్ష చేయగా పాజిటీవ్‌గా నిర్థారణ అయింది.బాబుకి ఐసోలేషన్ వార్డులో చికిత్స అందిస్తున్నామని, బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉషారాణి తెలిపారు.కోవిడ్ పై ఎలాంటి భయం వద్దని, ఒకవేళ అది సోకితే వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని, ఇప్పటి వరకు నిలోఫర్ ఆసుపత్రిలో ఒక కేసు మాత్రమే వచ్చిందని పేర్కొన్నారు.

### ప్రజా వాగ్గేయకారుడు సుద్దాల హానుమంతు

**తెలంగాణ గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్**



చిక్కడపల్లి, డిసెంబరు 22 ప్రభాతవార్త: కులోన్మాద, మతోన్మాద, రాజ్యోన్మాద శక్తులను దిక్కరించడానికి, ప్రజలను మేల్కొలపడానికి, ప్రజా వాగ్గేయకారుడు సుద్దాల హానుమంతు చేసిన కృషి నేటికి ప్రజలు మరిచిపోలేదని తెలంగాణ గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్ అన్నారు. శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా సుద్దాల హనుమంతు యాదిలో కార్యక్రమంలో జరిగిన సభ శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనారనదనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అయాచితం శ్రీధర్ మాట్లాడుతూ తొలితరం ప్రజాకవి, తెలంగాణ సాయుధపోరాట యోధుడు సుద్దాల హానుమంతు అని అన్నారు.

# ఆ ముగ్గురు ఘనాపాటీల అవినీతి లీలలు

### అవినీతికి కేరాఫ్ మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ● మేమింతే.. అంతా మా ఇష్టం

బాలానగర్ జోన్ ప్రతినిధి,డిసెంబరు 22 ప్రభాతవార్త: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా రిజిస్ట్రార్(డీఆర్) కార్యాలయంతోపాటు కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్, మేడ్చల్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ 1 కార్యాలయాలు అవినీతి , అక్రమ వసూళ్ళకు అడ్డాగా మారాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ రైటర్లు, దళారులు చెప్పిందే వేదంగా మారింది. ఒక్క డాక్యుమెంట్ పని పూర్తయి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తికి పత్రాలు రావాలంటే పెద్దమొత్తంలో ముడుపులు ఇవ్వాల్సి వస్తుందంటే ఈ కార్యాలయాల్లో అవినీతి ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొందరు అధికారులు, సిబ్బంది వసూల్ రాజాలుగా మారి రిజిస్ట్రేషన్‌కు వచ్చే వారి నుంచి అందినంత దండుకుంటున్నా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజి కార్యాలయం అధికారులు పట్టించుకోవడంలేదు.



**సబ్ రిజిస్ట్రార్, జాయింట్1 రిజిస్ట్రార్‌ల ఇష్టారాజ్యం.. ముడుపులిస్తేనే పనులు..**

కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్ 1 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఓ ఇద్దరు కీలక అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటి వసూలు డాక్యుమెంట్ రైటర్లు, బ్రోకర్లతో వారి ద్వారా వసూళ్ళ పర్వాన్ని సాగిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేయడానికి ప్రయత్నిస్తే వారి పనులు పెండింగ్‌లో పెట్టి పలుమార్లు తిప్పుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాల్లో పనులు పూర్తి కావాలంటే ముందు అధికారులను కలిస్తే పనులు జరుగవు. అక్కడే వుండే బ్రోకర్లు, డాక్యుమెంట్ రైటర్లను కలిసి చెబితే ఆ పనికి డబ్బులు ఎన్ని ఖర్చు అవుతాయో చెబుతాడు. వాటిలో బేరం కుదుర్చుకుని డబ్బులు ముట్టచెబితే పని త్వరగా పూర్తవుతంది. లేదంటే కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితిని కొందరు అధికారులు సృష్టిస్తున్నారు. కార్యాలయాల్లో అడిగినన్నీ మామూళ్ళు ఇవ్వకపోతే ఏదో ఒక కొర్రీ పెట్టి పనులు చేయడంలేదు. ఇంకేముంది మామూళ్లే లక్ష్యంగా ఒత్తిళ్ళు చేస్తున్న అధికారుల కారణంగా ఎంతో మంది దరఖాస్తుదారులు వారాలు , నెలల తరబడి తమ పనుల కోసం పడిగాపులు కాస్తూ, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ వద్దకు వచ్చే ఏ పనికైనా పైసలు ఇవ్వనిదే ఫైలు కదలడం లేదు. కనీసం ప్రతి ఫైలుకు రూ. 10వేలు, రూ.20 వేల నుంచి రూ. లక్షకు పైగానే వసూళ్ళు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ముడుపులు ఏ విధంగా వసూలు చేస్తున్నారంటే రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆస్తి విలువను బట్టి లంచాల డిమాండ్ ఉంది. ఏదైనా ఇళ్ళు, ప్లాటు, ఫ్లాటు భూమి కొనుగోలు చేసినప్పుడు అమ్మిన వారు, కొన్నవారు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళితే మొదట డాక్యుమెంట్ రైటర్‌ని కలుస్తారు. అక్కడకు వెళ్ళగానే మొదట వారు మనతో అదనంగా ఖర్చవుతుందని సెలవిస్తారు. ఇంకా వివాదస్పద భూమి అయితే లక్షలు అవుతాయని చెబుతారు. ఇలా వచ్చిన మామూళ్ళను ఇక్కడి కీలక అధికారులతోపాటు కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు పంచుకుంటారు. ఈ విధంగా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దోపిడి పర్వం కొనసాగుతుంది. ఇక్కడ అధికారుల అవినీతికి అదుపు చేయడంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి కార్యాలయంలోని ఉన్నతాధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తూ నెలవారీ మామూళ్ళకే పరిమితమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి.

**జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఘనుడు.. అవినీతికి కేరాఫ్ ఆ అధికారి**

స్టేట్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజి కార్యాలయం ఉన్నతాధికారుల అండదండలతో అధికారమే పెట్టుబడిగా మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్(డీఆర్) కార్యాలయంలో ఓ కీలక అధికారి చక్రం తిప్పుతున్నారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి ప్రస్తుత పోస్టులోకి వచ్చిన ఆయన వడ్డీతో రాబట్టుకునేదుకు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. ఇక్కడ నిత్యం జిల్లాలో స్థిరాస్తులు, క్రయ విక్రయాలు జరిగే ప్రాంతాలను పర్యవేక్షించే కార్యాలయం, ఎక్కడైనా అధికారులు, సిబ్బంది రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో పొరపాట్లు చేస్తే వాటిని చక్కబరిచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత కలిగిన కీలక అధికారి అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారు. తాను అడిగినంత ముడుపులు ఇవ్వకపోతే ఎట్టి పరిస్థితుల్లోనూ దస్త్రంపై సంతకం పడదనే ఓ అనధికారిక హుకుం జారీ చేశారు. ప్రతి పనికొక రేటు పెట్టి సబ్ రిజిస్ట్రార్లు, తన కింది స్థాయి అధికారులతో పాటు డాక్యుమెంట్ రైటర్లతో వసూళ్ళకు పాల్పడుతూ తన అవినీతి దందా కొనసాగిస్తున్నట్లు సదరు అధికారిపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. డాక్యుమెంట్లలో చిన్న చిన్న లోపాలను పెద్దవిగా చూపిస్తూ లక్షలాది రూపాయలను దండుకుంటున్నట్లు కీలక అధికారిపై ఆరోపణలు ఉన్నాయి. అవినీతి నిరోధక శాఖ దృష్టిసారిస్తే ఆయన అవినీతి చిట్టాతో పాటు నెలవారీ మామూళ్ళ బయటపడే అవకాశం ఉంది.

# టూరిజం ప్రమోషన్‌పై ప్రభుత్వం ఫోకస్

**మంత్రి జూపల్లి కృష్ణారావు**



పావురాలను ఎగురవేసి ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

హైదరాబాద్, డిసెంబరు 22,ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించే అంశాలలో టూరిజం ప్రమోషన్ ఒకటని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈమేరకు శుక్రవారం హైటెక్స్‌లో నిర్వహించిన పెటెక్స్, హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్ పేరుతో నిర్వహించిన రెండు వేర్వేరు ప్రదర్శనలను కుటుంబసభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణకు గొప్ప సాంస్కృతిక వారసత్వం, గణమైన చరిత్ర ఉందన్నారు. హైటెక్స్ టూరిజం యొక్క ముఖ్యమైన ప్రదేశమని ఇక్కడ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో నివసించే ప్రతి ఒక్కరూ తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటూ ప్రోత్సహించాలన్నారు. ఈసందర్భంగా తన భార్య, మనుమళ్లు వీర్ ,సిద్ధితో కలసి ఎగ్జిబిషన్‌లోని షోలను తిలకించారు. హైటెక్స్ హెడ్ శ్రీకాంత్ మాట్లాడుతూ కిడ్స్ ఫెయిర్ నాలుగు కీలక విభాగాలైన విద్య, జీవనశైలి ,పోషకాహారం, అభిరుచులు వంటి సేవలను ప్రదర్శిస్తున్నామన్నారు. అలాగే పెటెక్స్ ఒక ప్రదర్శన కాదని జంతువుల సంక్షేమంకోసం లోతుగా శ్రద్ద వహించే జీవితాలపై ప్రభావం ఉండేవిధంగా తీర్చిదిద్దాలన్నదే ఉద్దేశమన్నారు. ఈసందర్భంగా పెటెక్స్ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వాటిలో అరోవాహన చేప అందరినీ ఆకర్షిస్తుంది.

### స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి: జస్టిస్ సూరేపల్లి నంద

చిక్కడపల్లి, డిసెంబరు 22 ప్రభాతవార్త: దియాలిబాయ్ లాల్‌చంద్ గౌరీ చారిటబుల్‌ట్రస్ట్,సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఉచిత దంత, హృద్రోగ, ఇఎన్‌టి, క్యాన్సర్, మధుమేహం వైద్య ఆరోగ్యశిబిరం మీరా గౌరీ, దయానంద్‌గౌరీ, అదిలాబాద్ డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ కోర్టు జడ్జ్ ససనకోట మాధవి ఆధ్వర్యంలో జరిగింది. మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ సహకారంతో సికింద్రాబాద్ సిటీసివిల్ కోర్టు ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జసిస్టస్ సూరేపల్లి నంద హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

# పదోతరగతి విద్యార్థులపై నజర్

**ఉదయం సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు**

**నెలాఖరు వరకు సెలబస్ పూర్తయ్యేలా ప్రణాళికలు**

**ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ ఆదేశం**

**వెంటాడున్న టీచర్ల కొరత ఉన్నవారికే తప్పని ఒత్తిడి**





హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త: పదోతరగతిపై విద్యాశాఖ ఫోకస్ పెట్టింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణకు దిగింది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల నిర్వాహణకు సిద్ధమైంది. ఇప్పటికే విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి చేసింది. ఈనెలాఖరు నాటికి సిలబస్ పూర్తిచేసి వచ్చేనెల నుంచి రివిజన్ ప్రక్రియను కొనసాగించేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా పదోతరగతిలో ఎక్కువగా ఫెయిలయ్యే సబ్జెక్ట్‌లపై ఫోకస్‌పెట్టి ప్రత్యేక తరగతులు నిర్వహించేదుకు చర్యలు తీసుకుంటుంది. పాఠశాల పనిదినాల్లో ఉదయం వేళల్లో బాలికలకు, సాయంత్రం బాలురకు ఒకగంట అదనంగా ప్రత్యేక తరగతులను నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. వారానికి దాదాపు 12క్లాసులు బోధిస్తున్న ఉపాధ్యాయులు ఇందులో నాలుగు క్లాసులు గణితం, ఐదుక్లాసులు సామాన్యశాస్త్రం, మూడు క్లాసులు సాంఘీక శాస్త్రం, ఆంగ్లం, తెలుగు సబ్జెక్ట్‌లు బోధించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పదోతరగతి విద్యార్థులను ఫిబ్రవరి నుంచి ప్రతిరోజు ఉదయం 4నుంచి 5గంటల వ్యవధిలో ఫోన్లద్వారా నిద్ర లేపేందుకు కూడా ప్రత్యేక ఉపాధ్యాయులను కేటాయించడం, వారి పనితీరును పర్యవేక్షించేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తుంది.

**వెంటాడుతున్న టీచర్ల కొరత..** ముఖ్యంగా సర్కార్ బడుల్లో సబ్జెక్టు టీచర్ల కొరత వెంటాడుతుంది. పదవీవిరమణ చేసిన టీచర్ల స్థానంలో కొత్తవారి భర్తీ లేక ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. సబ్జెక్ట్ టీచర్లతో పాటు భాషాపండితుల పోస్టు లు కూడా ఖాళీగా ఉడటం విస్మయానికి గురిచేస్తుంది. కరోనా నేపథ్యంలో వరుసగా రెండేళ్ల పాటు ప్రభుత్వ నిర్ణయంతో పరీక్షలు లేకుండా విద్యార్థు లంతా ఉత్తీర్ణులయ్యారు. గతేడాది సబ్జెక్ట్ టీచర్లు లేకుండా విద్యా సంవత్సరం గడిచిపో యింది. ఫలితంగా చాలామంది విద్యా ర్థులు పలు సబ్జెక్టుల్లో తప్పారు. ఈ సంవత్సరం కూడా టీచర్ల భర్తీ ఊసే లేకుండా పోయింది.

**ఆశించిన ఫలితాలు రావట్లే..** హైదరాబాద్ జిల్లా పరిధిలో సర్కార్ బడుల్లో గత విద్యాసంవత్సరం పదోతరగతి ఫలితాలు పరిస్థితి అధ్వానంగా మారింది. కేవలం 72శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 7,244 మంది విద్యార్థుల్లో సుమారు 2,009 మంది ఉత్తీర్ణత సాధిం చలేకపోయారు. నాంపల్లి, బహదూర్‌పురా, చార్మినార్, బండ్లగూడ, సికింద్రా బాద్, మండలాల్లోని బడుల్లో 63శాతం మించి ఉత్తీర్ణత లేకపోగా, మారేడుపల్లి,హిమాయత్‌నగర్, గోల్కొండ, ముషీరాబాద్ మండలాల్లో 75శాతం మించి ఉత్తీర్ణత నమోదు కాలేదు. కేవలం తొమ్మిది సర్కారు బడుల్లోనే వందశాతం ఉత్తీర్ణత సాధించారు. సబ్జెక్టుల వారీగా ఫలి తాలను పరిశీలిస్తే గణిత శాస్త్రంలో 9,425, సైన్స్‌లో 6,321, ఇంగ్లీష్‌లో 1,129, సాంఘీక శాస్త్రంలో 1,021 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేక పోయారు. ఇక ప్రథమ, ద్వితీయ భాషల్లోనూ కొందరు విద్యార్థులు పాస్ కాలేదు. ప్రథమ భాష తెలుగులో 1,331 హిందీలో 845, ఉర్దూలో 685, ద్వితీయ భాష తెలుగులో 1,390, హందీలో 117, మంది ఉత్తీర్ణత సాధించలేకపోయినట్లు విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## పంజాగుట్టలోని అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

**6వ అంతస్తులో ఎగిసిపడ్డ మంటలు**

**ప్రాణాలకు తెగించి కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్**

హైదరాబాద్, డిసెంబరు 23,ప్రభాతవార్త: నగరంలోని పంజాగుట్ట ఎర్రమంజిల్‌ని ఓఅపార్ట్‌మెంట్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. అపార్ట్‌మెంట్ ఆరో అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బిల్డింగ్ మొత్తానికి వ్యాపించడంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతోఅందులో నివసిస్తున్న కొంతమంది ప్రాణభయంతో బయటకువచ్చి ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఐర్‌సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా మంటల్లో చిక్కుకున్న కుటుంబాన్ని ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రావణ్ కుమార్ ప్రాణాలకు తెగించి రక్షించారు. మంటలు ఎగిసిపడుతున్న సమయంలోనే అక్కడ డంబెల్ సహాయంతో డోరును బద్దలు కొట్టి కుటుంబాన్ని బయటకు తీసుకొచ్చారు. దీంతో అక్కడ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో కానిస్టేబుల్ సహసాన్ని పలువురు అభినందించారు.

## ఘనంగా వెంకటస్వామి వర్ధంతి



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

సైఫాబాద్, డిసెంబరు 22 ప్రభాతవార్త: దళిత నేత, కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి 9వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం ట్యాంక్‌బండ్‌పైనగల ఆయన విగ్రహం ఎదుట ఘనంగా జరిగింది. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు జి.వివేక్‌వెంకటస్వామి, జి.వినోద్, వివిధ దళిత సంఘాల నాయకులు రాజుఉస్తాద్, కె.బాలకృష్ణ, జంగా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వెంకటస్వామి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దళితులు, పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు.



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న పంకజ్ కుమార్ అగర్వాల్

## పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ

చార్మినార్, డిసెంబరు 22 ప్రభాతవార్త : పాతబస్తీ కోకరివాడికి చెందిన కుంభమేళ అగ్రవాల్ బంధు అధ్యక్షులు,వ్యాపారి పంకజ్ కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాలలో నిరుపేదలకు చీరలు,దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కుంభమేళ అగ్రవాల్ బంధు ప్రతి నిధులు పంకజ్ కుమార్,రవీందర్ నార్‌నౌల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## అత్తాపూర్‌లో వృద్ధుడు అదృశ్యం



అదృశ్యమైన భూపతిరావు

మైలార్‌దేవ్‌పల్లి,డిసెంబరు 22 ప్రభాతవార్త : డబ్బై నాలుగు సంవత్సరాల వయస్సు గల ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...అత్తాపూర్‌లోని తన అల్లుడు వెంకటేశ్వరరావు ఇంటికి కొద్ది రోజుల క్రితం భూపతి రావు వచ్చాడు.ఈ నెల20వ తేదీ సాయంత్రం మూడు గంటల సమయంలో చలిగా ఉందని చెప్పి భూపతిరావు ఇంటి ముందు కూర్చున్నాడు.కొంత సేపటి తర్వాత భూపతిరావు కనిపించలేదు.అతని కోసం కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికినా ఫలితం లేకపోయింది.మామ భూపతిరావు కనిపించటం లేదంటూ అల్లుడు వెంకటేశ్వరరావు అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈకేసును అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## లండన్‌లోని రాడాంక్స్ సంస్థతో ఆస్రా మధ్యవర్తిత్వంపై ఓప్పందం

సైఫాబాద్, డిసెంబరు 22 ప్రభాతవార్త: అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటి అండ్ అవేర్నస్ (ఆస్రా), యూకే సంస్థ రాడాంక్స్‌తో శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'మధ్యవర్తిత్వం'పై ఒప్పంద చేసుకుంది. ఈ విషయాన్ని శుక్రవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్త్రా ఫౌండేషన్ అధ్యక్షుడు హామీబ్ సుల్తాన్‌ఆలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆలీ మాట్లాడుతూ గత సెప్టెంబరు 13న సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వంపై ఉత్తర్వులు ఇచ్చిందని గ్లోబల్ ఇంటిగ్రేటెడ్ లీగల్ కేర్, మధ్యవర్తిత్వం సేవల్లో రాడాంక్స్ సంస్థ అగ్రగామిగా నిలిచిందని, ఈ సంస్థతో తమ ఆస్రా ఒప్పందం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆస్రా సంస్థ ప్రస్తుతం 10 రాష్ట్రాలలో విస్తరించిందని, అన్ని సివిల్ సమస్యలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం అవుతాయని ఆయన అశాభావం వ్యక్తం చేశారు. రాడాంక్స్ సంస్థ వ్యవస్థాపకురాలు డా.రేణురాజ్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వంపై శిక్షణా కార్యక్రమం ఆరు రోజులు 45 గంటలపాటు ఉంటాయని, అన్ని స్టడీ మెటిరియల్స్ అందించబడతాయని చెప్పారు. ఈ కోర్సుకు ఫీజులో 70 శాతం డిస్కౌంట్ కల్పిస్తామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో ఆస్రా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్‌గుప్తా, రాష్ట్ర కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌నాయక్, న్యాయవాదులు కట్టమూరి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిమ్నజాతుల కోసం శ్యాంసుందర్ చేసిన సేవలు మరువలేము

సైఫాబాద్, డిసెంబరు 22 ప్రభాతవార్త: మూల భారతీయుల హక్కుల పితామహుడు భారతీయ భీమ్‌సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బి.శ్యాంసుందర్ నిమ్మజాతుల అభివృద్ధి కోసం ఎనలేని సేవలు అందించారని, ఆయన సేవలు మరువలేనివని భారతీయ భీమ్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేపూరి రాజు కొనియాడారు. శుక్రవారం సూర్యలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన బి.శ్యాంసుందర్ 115 జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్‌కు అత్యంత ప్రీతిపాత్రుడైన శ్యాంసుందర్ రౌండ్‌టేబుల్ సమావేశంలో అంబేద్కర్ చేసిన ప్రసంగాలకు పూర్తిగా మద్దతు ప్రకటించి ఆయన వెన్నంటె ఉండేవారని గుర్తు చేశారు. అంబేద్కర్ మరణాంతరం శ్యాంసుందర్ అంబేద్కరిజాన్ని ముందుకు తీసుకువెళ్ళారని, ఆయన అశయాల సాధనకు విశేషంగా ప్రచారాన్ని నిర్వహించారన్నారు. నిజాం పాలనకు, దొరల గడీల పాలనకు, ఆర్య బ్రాహ్మణకు వ్యతిరేకంగా పోరాటం చేసి నిమ్నజాతుల పక్షాన శ్యాంసుందర్ నిలబడ్డారని ఆయన కొనియాడారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఛైర్మన్ నల్లసూర్యప్రకాష్ మాట్లాడుతూ శ్యాంసుందర్ అశయాల సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సౌత్ ఇండియా ఇన్‌చార్జీ మండల డానియేల్, సీనియర్ అడ్వకేట్స్ పుట్టా పద్మారావు, స్వామ్రాట్, దాసు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ప్రోత్సహిస్తున్న టీచర్లను అభినందించిన ఎమ్మెల్యే



మాథ్స్ ఫెయిర్‌లో పాల్గొన్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, డిసెంబరు 22 ప్రభాతవార్త: విద్యార్థులకు గణితం పట్ల విద్యార్థులలో ఉన్న భయాన్ని పోగొట్టి తెలికగా లెక్కలు నేర్చుకునే ప్రక్రియను అందించి ప్రోత్సహిస్తున్న టీచర్లను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అభినందించారు. ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం గోల్నాకలోని సూపర్ ట్విన్ సిటీస్ హైస్కూల్‌లో నిర్వహించిన మాథ్స్ ఫెయిర్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మాథ్స్‌లోని టెక్నిక్స్‌ను తెలుసుకోవాలని, ఆధైర్యపడరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాడెంట్ ఎం.శశికళ, ప్రిన్సిపల్ డా.ఎం.చంద్రమోహన్‌ను ఎమ్మెల్యే అభినందించారు. స్కూల్ టీచర్స్‌ను సత్కరించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

## కన్నుల పండువగా నవగ్రహావిగ్రహాల ప్రతిష్టాపన

షాబాద్, డిసెంబర్ 22, ప్రభాతవార్త : షాబాద్ మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామంలో గత రెండు రోజులుగా నవగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. శుక్రవారం నవ గ్రహ విగ్రహాలకు ప్రాణ: ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. చలువ పందిళ్ల నడుమ, భాజభజింత్రిల మధ్య, వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ యజ్ఞ, యాగాలు, విగ్రహాలకు ప్రాణప్రతిష్టా చేశారు.అనంతరం వివిధ గ్రామాల నుండి వచ్చిన భజన భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ దండు అర్చనసుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ పర్వేద మల్లేష్, గ్రామస్థులు దండు యాదవరెడ్డి, చంద్రారెడ్డి, బాల్‌రాజ్, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాములు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు శ్రీనివాసరామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

షాబాద్, డిసెంబర్ 22, ప్రభాతవార్త : విద్యార్థులు శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని మాంటీసోనీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని మాంటీసోరి ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... శ్రీనివాస రామానుజన్ భారతదేశం గర్వించదగ్గ గొప్ప గణితశాస్త్రవేత్త అని అన్నారు. రామానుజన్ దేశానికే ఆదర్శప్రాయుడని, నేటి తరానికి గొప్ప మార్గదర్శకులని కొనియాడారు. విద్యార్థులు గణితశాస్త్రాన్ని కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.




రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనా చంటిని అభినందిస్తూ ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న జంపనప్రతాప్

## విద్యార్థులు చదువుతో పాటు అంతర్జాతీయ క్రీడా పోటీల్లో ఎదగాలి

### జంపనప్రతాప్

కంటోన్మెంట్, డిసెంబర్ 22 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో,హాస్టళ్లలో చదువుతున్న గిరిజన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. బోయిన్‌పల్లి గిరిజన హాస్టల్‌లో ఉంటూ మట్ పోర్ట్ ప్రభుత్వ పాఠశాలలో చంటీ 8వ తరగతి చదవుతున్న విద్యార్థి జిల్లా స్థాయి, జోనల్ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలు వచ్చే నెల 4వ తేదీన భద్రాచలంలో నిర్వహించనున్న పోటీలకు ఎంపికైయ్యాడు. ఆ విద్యార్థికి ఆర్థిక సహాయాన్ని, ఆట వస్తువుల క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర భంగా జంపనప్రతాప్‌ను పాఠశాల హెడ్‌మాస్టర్లు సెడ్రక్, సుప్రద, గణపతి శర్మలు అభినందించారు. ఈ కార్య క్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## గీతాంజలి హై స్కూల్‌లో ఘనంగా మనుయాన్ - 2




మారేడ్‌పల్లి గీతాంజలి హై స్కూల్‌లో మనుయాన్-2 వేడుకలను ప్రారంభిస్తున్న చైర్మన్ శ్రీనివాస్ రావ్,ప్రిన్సిపాల్ వేద తదితరులు

అడ్డగుట్ట, డిసెంబర్ 22 ప్రభాతవార్త: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు వైజ్ఞానికి ప్రదర్శన, మనుయాన్ ఎంతగానో ఉపయోగపడుతుందని గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ పుట్టి శ్రీనివాస్‌రావ్ తెలిపారు. శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని గీతాంజలి హై స్కూల్‌లో నిర్వహించిన మన్‌యాన్ -2 వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు హై డ్రోపొనిక్స్, హై డ్రాలిక్స్,చంద్రాయన్ -3,ఇస్రో,రాకేట్, సాటిలైట్ కమ్యూనిటీ కేషన్,విద్యుత్, వ్యవసాయం, ఎద్దుల బండి నుంచి హై డ్రాలిక్ కారు వంటి ప్రదర్శనలు పలువురిని అలరించాయి.

## నేడు పెరుమాల్ దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం

### చైర్మన్ వై.నర్సారెడ్డి

అడ్డగుట్ట, డిసెంబర్ 22 ప్రభాతవార్త: సికింద్రాబాద్,కంటోన్మెంట్ శివాజీ నగర్‌లో ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకటేశ్వర పెరుమాల్ దేవాలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలు బారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ రినోవేషన్ కమిటీ చైర్మన్ వై.నర్సారెడ్డి, ఆలయ కార్య నిర్వాహన అధికారి కె.పి.సత్యమూర్తిలు తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాటా్లడుతూ ధనుర్ మాస అధ్యయన వేడుకలను పురస్కరించుకొని పెరుమాల్ దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శన వంటి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు వి.నిత్యానంద్, పింజర్ల మురళీ యాదవ్,తేజ్‌పాల్, కాశిరెడ్డి నరేందర్ రెడ్డి, వంగ నరేశ్, గోవిందన్, మైసాని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అత్తాపూర్‌లో క్రిస్మస్ వేడుకలు




క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న నారాయణ పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి,డిసెంబరు 22 ప్రభాతవార్త : అత్తాపూర్ నారాయణ పాఠశాలలో శుక్రవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. విద్యార్థులు ప్రదర్శించిన పలు రకాల వేష ధారణాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏజిఎం శ్రీనివాస్‌రెడ్డి క్రిస్మస్ సందేశాన్ని అందించి కేక్ కట్ చేశారు.కాగా నారాయణ పాఠశాలలో మ్యాథ్‌మెటిక్స్ డే సందర్భంగా ప్రపంచం గర్వించ చదగ్గ భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ జన్మదినాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దమయంతి, ఏఓ సుదర్శన్, వైస్ ప్రిన్సిపాల్ తులసీ విధ్యాదేవి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా స్వామి వారి అక్షింతలు శోభాయాత్ర



కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబరు 22 ప్రభాతవార్త : అయోధ్య శ్రీ రామ మందిర నిర్మాణం పూజిత అంక్షితలు శుక్రవారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని నందిబుస్లాయిగూడ సాయి నగర్‌లోని శ్రీ రామమందిరానికి చేరుకోవటం జరిగింది. రంగారెడ్డి జిల్లా ఓబిసి మోర్చ ఉపాధ్యక్షులు ఎస్.వాసు ఆధ్వర్యంలో పరమ పవిత్రమైన స్వామి వారి అంక్షితలను వైభవంగా శోభా యాత్రగా నిర్వహించి శ్రీ రామ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీ శంకర్,స్టార్ రాజు,వెంకట్‌రెడ్డి, సిద్దేశ్వర్, విజయ్,వెంకటేష్,ముఖేష్,శశికాంత్ శర్మ,గణేష్,రాజు,అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## కరసేవకులను ఘన సన్మానం



కార్యక్రమంలో పాల్గొన్న శైవ క్షేత్ర పీఠాధిపతి శివ స్వామి,కరసేవకులు

హైదరాబాద్, డిసెంబర్ 22 ప్రభాతవార్త: అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని అంబర్‌పేట నియోజక వర్గానికి చెందిన కరసేవకులను శైవ క్షేత్ర పీఠాధిపతి శ్రీ శివ స్వామి శుక్రవారం ఘనంగా సన్మానించారు. మాజీ కార్పోరేటర్ అప్పటి వాహిని ప్రముఖ్ గోవింద గిరి ముదిరాజ్ ఆద్వర్యంలో 1990లో అయోధ్యకు వెళ్లి అరెస్టు అయి 48 రోజుల పాటు ఉత్తర్ ప్రదేశ్‌లోని వారణాసి నైని జైలు జీవితం గడిపిన కరసేవకులు నాయిని బుచ్చిరెడ్డి, బొల్లంపల్లి రంజిత్ రెడ్డి, లిక్కం అనిల్‌కుమార్, సి.శ్రీనివాస్ ముదిరాజ్, కొండ శివకుమార్ లను స్వామి జీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా. గౌతమ్‌రావు, నాయకులు దత్తు ముదిరాజ్, గోవర్ధన్ రెడ్డి, లక్ష్మణ్,మధుసూదన్, రవికాంత్, మంగి శివకుమార్, గోవింద అర్జున్, సంజీవ్ చౌదరి, మహేష్ ముదిరాజ్, కిషోర్ ముదిరాజ్, అయితా హేమ,పోరాటి కవిత రెడ్డి,దేవికరెడ్డి, లక్ష్మి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శ్రద్దగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

షాబాద్, డిసెంబర్ 22, ప్రభాతవార్త : విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని షాబాద్ ఎస్సై మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు మాట్లాడి భోజనం ఏ విధంగా ఉందని తెలుసుకున్నారు. అనంతరం తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యార్థి దశ చాలా కీలకమని, మనం ఏం కావాలనుకున్నా కష్టపడి చదవాలన్నారు. తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చే బాధ్యత మీపై ఉందన్నారు. శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్సై రాంలాల్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ షాక్ తగిలి గేదె మృతి

షాబాద్, డిసెంబర్ 22, ప్రభాతవార్త : విద్యుత్ షాక్ తగిలి గేదె మృతి చెందిన సంఘటన షాబాద్ మండల పరిధిలోని ఉబ్బగుంట గ్రామంలో చోటుచేసుకుంది. రైతు చిల్కమర్రి రాజు తెలిపిన వివరాల మేరకు గ్రామ సమీపంలో పొలం వద్ద గేదేను మేపుతుండగా పక్కనే తెగిపడి ఉన్న విద్యుత్ వైర్ తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలన్నారు.

## పేద ప్రజల ఇండ్లను కూల్చివేయడం దారుణం: ఎంపీపీ

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 22, ప్రభాత వార్త: పేద ప్రజల ఇండ్లను కూల్చివేయడం సరియైన చర్యకాదని ఎంపీపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలంతో పాటు జంట మున్సిపాల్టిల్లో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ కట్టడాలను గత కొద్ది రోజులుగా రెవెన్యూ అధికారులు కూల్చివేతకు పాల్పడుతున్నారు. తాజాగా మండలంలోని కాచవాని సింగారంలో శుక్రవారం ఆరు ఇండ్లను రెవెన్యూ అధికారులు తహసీల్దార్ కృష్ణ ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు మధ్యన జేసీబీ యంత్ర సహాయంతో కూల్చివేశారు. సమాచారం అందుకున్న బీజేపీ నాయకుడు ఎంపీపీ కాచవాని సింగారంలోని అధికారులు ఇండ్లు కూల్చివేసిన ప్రాంతాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. బాధితులకు అండగా ఉంటానని బీద ప్రజలకు న్యాయం జరిగేంతవరకు ఉద్యమిస్తానని అన్నారు. పేదలు ఇండ్లు కట్టుకోవడానికి ప్రభుత్వం పట్టాలు ఇచ్చి అండగా నిలువాలని అన్నారు.

## పరిసరాల పరిశుభ్రతకు తడి పొడి

### చెత్తను వేరు చేసి చెత్తబండిలో వేయాలి

ఘట్‌కేసర్, డిసెంబర్ 22, ప్రభాత వార్త: తడి పొడి చెత్త వేర్వేరుగా వేయుటకు ఘట్‌కేసర్ మున్సిపల్ 1 వ వార్డు కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి శుక్రవారం ఇంటింటికి తిరిగి క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. మున్సిపల్ 1 వ వార్డు కౌన్సిలర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై ప్రతి ఒక్కరు అవగాహన కల్గియుండాలని అన్నారు.మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

## ట్రంక్ లైన్ నిర్మాణం పూర్తయితే సమస్యలు పరిష్కారం : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ట్రంక్ లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్‌బినగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** ట్రంక్‌లైన్ నిర్మాణం పనులు పూర్తయితే ముంపు ప్రాంతాల ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలో జరుగుతున్న ఎస్ఎన్‌డిపీ పైప్‌లైన్ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ బండ్లగూడ తూము నుంచి వచ్చే వర్షపునీరు సాఫీగా పోవడానికి ట్రంక్‌లైన్ పనులు ప్రారంభించామని, ప్రస్తుతం ప్రధానరహదారి దగ్గర వరకు ట్రంక్‌లైన్ నిర్మాణం పూర్తయిందన్నారు. ట్రాఫిక్ ఏసిపీ ఫోన్లో మాట్లాడి ప్రజా అవసరాలు దృష్టిలో పెట్టుకుని రోడ్డు తవ్వడానికి అనుమతి ఇవ్వాలని కోరామన్నారు. ఈ లైన్ నేరుగా నాగోల్ చెరువులోకి కలుస్తుందని, పనులు సకాలంలో పూర్తి అయితే ఎంత పెద్ద వర్షం వచ్చిన ఇబ్బందులు ఉండవన్నారు. పనుల విషయంలో ప్రజలు కూడా అధికారులకు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెరుకు ప్రశాంత్‌గౌడ్, సతీష్‌యాదవ్, చిరంజీవి, రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని మంత్రికి వినతి

**ఉప్పల్, డిసెంబరు 22 ప్రభాతవార్త :** తెలంగాణలో ఎస్సీ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు మరో రెండు సంవత్సరాలు పొడగించాలని తెలంగాణ పిల్మ్ క్లబ్ సోషల్ అర్టిస్ట్ రాయల్‌బాబు విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహాను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆగిపోయిన సంక్షేమ పథకాలు త్వరగా ప్రారంభించాలని కోరారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పిల్మ్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్‌లోని శ్రీ ద్వారకామాయి సాయి బాబా పీఠంలో ఘనంగా గీతా జయంతి



శ్రీకృష్ణునికి అభిషేకం చేస్తున్న పీఠాధిపతి గోపాలకృష్ణానందస్వామీజీ

**సరూర్‌నగర్, డిసెంబర్ 22 ప్రభాత వార్త:** మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్‌లోని శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠంలో శుక్రవారం గీతా జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. శ్రీ దత్త సిద్ధాంతకర్త సాయిబాబా పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామి మంగళశాసనములతో తలపెట్టిన గీతా జయంతిని పురస్కరించుకొని బాబా మందిరంలో శ్రీ కృష్ణ పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ శ్రీకృష్ణ విగ్రహానికి అభిషేకం, అర్చనలు జరిపి అనంతరం పవిత్ర భగవద్గీత గ్రంథానికి సహస్ర నామాలతో పుష్పార్చన చేశారు. ఆ తర్వాత స్వామీజీ భగవద్గీత ప్రవచనం చేసి ముఖ్య శ్లోకాలను గానం చేశారు. చివరగా సాయిబాబా హారతి, తీర్థప్రసాదాల వితరణ చేసి కార్యక్రమానికి ముగించారు. గీతా జయంతికి బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, బాబా భక్తులు ఎస్‌పి శాస్త్రి, పీఠం మాతాజీ మల్లాది విజయశ్రీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : కార్పొరేటర్ బొక్కా భాగ్యలక్ష్మి



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొక్కా భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, డిసెంబర్ 21 ప్రభాతవార్త :** ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తామని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్కా భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మూసారాంబాగ్ డివిజన్‌లోని ఎస్‌బిహెచ్ కాలనీ కృష్ణానగర్‌లో రూ. 14 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణం పనులను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటివరకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. డివిజన్‌లో ప్రతినిత్యం వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటిస్తూ స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌యాదవ్, ఎస్ఎఫ్ఎలు శ్రీనివాస్, ఉమేష్, మల్లేష్, శ్రీను, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## హరిహర క్షేత్రంలో ఘనంగా కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

**మలక్‌పేట, డిసెంబరు 21 ప్రభాతవార్త:** మలక్‌పేట పల్టాన్‌లోని శ్రీ హరి హర క్షేత్రంలో ధనుర్మాసఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ సూగూరు రమేష్ మాట్లాడుతూ ధనుర్మాస ఉత్సవాలు జనవరి 14వ తేదీవరకు కొనసాగుతాయని తెలిపారు. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి రోజు ఉదయం ఆరాధన, అంకారం, ధనుర్మాస అర్చనలు, నివేదన, తిరుప్పావై సేవాకాలము, మంగళ శాసనము, పాశుర విన్నపము, తీర్థ ప్రసాద గోష్టి తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 23వ తేదీ శనివారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి అభిషేకం, శ్రీ వైకుంఠ ద్వార దర్శనం, జనవరి 11వ తేదీన ధర్మకుదారై పాశురం, గంగాదేవి నీరాటోత్సవం, 108 గంగాళాలతో అక్కాల పడిశల్ ప్రసాద నివేదన, 14వ తేదీ ఆదివారం శ్రీ గోదా కల్యాణం తదితరకార్యక్రమామలను నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. మరిన్న వివరాలకు అర్చకులు శ్రీనివాసాచార్యులు, చంద్రశేఖరశర్మలను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇఓ జోషి మార్తాండరావు, సభ్యులు శెట్టి విజయ్ కుమార్, సరాపు శ్రీహరి, వనం సత్యేందర్, రొడ్డ రమేష్, రేణుఅగర్వాల్, పారిజాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం : చెకొలేకార్ శ్రీనివాస్



ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలను కలిసిన చెకొలేకార్ శ్రీనివాస్

**మలక్‌పేట, డిసెంబర్ 21 ప్రభాత వార్త :** కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమమే సాధ్యమవుతుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మలక్‌పేటనియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి చెకొలేకార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంకోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా క్రీడా పోటీలు



ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ట్రస్మా స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న వివిధ పాఠశాల విద్యార్థులు దృశ్యం.

**ఉప్పల్, డిసెంబరు 22 ప్రభాతవార్త :** ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో ట్రస్మా మేడిపల్లి మండలం ప్రైవేటు పాఠశాలల యజమాన్యం ఆధ్వర్యంలో శుక్రవారం స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ సిఐ శ్రవణ్‌కుమార్, రాష్ట్ర ట్రస్మా కార్యదర్శి మధుసూధన్, జిల్లా ట్రస్మా అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, మేడిపల్లి మండలం అధ్యక్షుడు పి.రవీందర్,కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి జైనుద్దీన్, సలహాదారులు, పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఐ శ్రవణ్‌కుమార్ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలని కోరారు. క్రీడలతో శారీరక దారుఢ్యం పెంపొందుతుందని, విధిగా క్రీడలలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, చెస్ ఆటలు ఆడేందుకు వివిధ ప్రాంతాల నుంచి పలువురు విద్యార్థులు తరలివచ్చారు. అనంతరం క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మోహన్‌నగర్ చర్చిలో మినీ క్రిస్మస్ వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న దేవానంద్‌రాజశ్రీ

**ఎల్‌బినగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** క్రిస్మస్ వేడుకలలో భాగంగా కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని సెంట్ మథుస్ ఫుల్ గోస్పాల్ మినిస్ట్రీస్ చర్చిలో మినీ క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంఘ కాపరి రెవరెండ్ ఎం.దేవానంద్‌రాజశ్రీల ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలకు క్రిస్మస్ ప్రత్యేక ఆహ్వానితుడిగా రెవరెండ్ డాక్టర్ ప్రేమ్‌కుమార్ హాజరై భక్తులకు క్రిస్మస్ సందేశాన్ని అందజేశారు. క్రీస్తు గొప్పతనం గురించి పలు బోధనలను చేశారు. ఈ సందర్భంగా వేడుకలకు హాజరైన భక్తులకు దేవానంద్‌రాజశ్రీల ఆధ్వర్యంలో ప్రేమ విందును అందజేశారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని చర్చిని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. వేడుకలలో భాగంగా క్రీస్తు జయంతిని తెలియజేస్తూ భక్తులు ఆటలు, పాటలు, భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు ప్రసాద్, ప్రసన్న, సువర్ణప్రసాద్, కవిత, ప్రశాంత్, అనిల్‌కుమార్, పల్లవి, మోహన్‌గ్రేస్, రాహేలమ్మ, జయలక్ష్మి, సువార్తరాణి, ప్రసన్నపాల్ పాల్గొన్నారు.

## చిలుక ఆధ్వర్యంలో క్రిస్మస్ చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న చిలుక మధురఉపేందర్‌రెడ్డి

**ఎల్‌బినగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** పండుగలు అందరిలో సోదర భావాన్ని పెంపొందిస్తాయని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోనే ఉపేందర్ రెడ్డి నివాసంలో క్రిస్మస్‌పర్వదినం సందర్భంగా శుక్రవారం క్రైస్తవ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ, రేణుక, అరుణ, మాధవి, సంతోషి, రూప, మమత, జయశ్రీ, కవిత, లక్ష్మి భాయ్, మంజు, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీల సస్పెండ్‌కు నిరసనగా ధర్నా



ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**మల్కాజిగిరి, డిసెంబర్ 21 ప్రభాతవార్త :** ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద పార్లమెంటులో ఇండియా కూటమి ఎంపీలను, రాజ్యసభలో ఎంపీలను సస్పెండ్ చేసినందుకు నిరసనగా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, సీనియర్ నాయకులు ధర్నా కార్యక్రమానికి మల్కాజిగిరి ఆనంద్‌బాగ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, సతీష్‌కుమార్, గుండా నిరంజన్, బికే.శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, ప్రవీణ్, పంజా శ్రీనివాస్ యాదవ్, సంతోష్ రాందాస్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తర ద్వార దర్శనానికి సిద్ధమైన జిల్లెలగూడ శ్రీవారి ఆలయం



ఆలయాన్ని ముస్తాబు చేయిస్తున్న ఇఓ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు

**సరూర్‌నగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉత్తర సింహద్వారం ఉన్న అరుదైన ప్రాచీన దేవాలయాల్లో ఒకటైన బాలాపూర్ మండలం (పూర్వ సరూర్‌నగర్ మండలం)లోని జిల్లెలగూడ గ్రామంలోనున్న శ్రీదేవి భూదేవి సమేత మత్స్యావతార శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) పర్వదినానికి సిద్ధమైంది. శ్రీవారు స్వయంబుగా వెలసిన వందల సంవత్సరాల చరిత్ర గల ఈ దేవాలయంలో శ్రీమన్నారాయణుడికి అత్యంత ప్రీతిపాత్రమైన ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో శనివారం వచ్చిన ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఆలయ ఇఓ వై.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వాలంటీర్లుగా వ్యవహరిస్తున్న ఆలయ మాజీ ధర్మకర్తలు బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, పోరెడ్డి జంగారెడ్డి, చింతపట్ల జ్ఞానేశ్వరచారిల పర్యవేక్షణలో ఆలయ సుందరీకరణ పనులతో పాటు భక్తుల సౌకర్యార్థం ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. ఉత్తర ద్వారంలో భక్తులు దర్శించుకునే శ్రీమన్నారాయణుడి కోసం సర్వాంగ సుందరంగా మండపాన్ని ఏర్పాటు చేశారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం భారీ ఎత్తున పులిహోర ప్రసాదం తయారీకి చర్యలు తీసుకున్నారు.

**ఉదయం 5 గంటల నుండి ఉత్తర ద్వార దర్శనాలు ప్రారంభం...** శనివారం ఉదయం 5 గంటలనుండి స్వామివారి ఉత్తర ద్వార దర్శనాలు ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వేకువ జామున 4 గంటలకు స్వామివారి సుప్రభాత సేవ, ఆరాధన, సేవాకాలం, అర్చన అనంతరం మంగళాశాసనములతో తులసీ అర్చన తర్వాత భక్తులను ఉత్తర ద్వారం నుండి శ్రీమన్నారాయణుడి దర్శనం కోసం అనుమతిస్తామని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో గోవింద నామ స్మరణల మధ్య భక్తులు స్వామివారి దర్శనం చేసుకొని వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## బీరప్పగడ్డలో సెమీ క్రిస్మస్ వేడుకలు : గీత



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 22 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ బీరప్పగడ్డ ఈసేవ వీధిలో పాస్టర్ జోసఫ్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ జోసఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పాల్గొని కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సిఎం కెసిఆర్ అధికారంలో ఉన్న సమయంలో అన్ని పండుగలు అధికారికంగా నిర్వహించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కూడా పండుగలను ప్రభుత్వపరంగా చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, ఏదుల కొండల్‌రెడ్డి, కె.జగన్, నవీన్‌చారి, శ్యామ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మీర్‌పేట్‌లో ఉచిత వైద్య శిబిరం

**సరూర్‌నగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పాత గ్రామంలోని పోస్టాఫీస్ వద్ద శనివారం ఉదయం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని స్థానిక 45వ డివిజన్ కార్పొరేటర్ అక్కి మాధవి ఈశ్వర్‌గౌడ్ తెలిపారు. నక్షత్ర ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించే ఈ శిబిరంలో ఇసిజి, రక్తపరీక్షలతో పాటు సాధారణ పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరుగుతుందని ఆమె వెల్లడించారు. సేవా దృక్పథంతో నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## ఎంపిల సస్పెండ్‌ను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం, నిరసనలు



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

**తుర్కయాంజాల్, డిసెంబర్ 21 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా లోక్‌సభ, రాజ్యసభలో 146 మంది పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ సిపిఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం తుర్కయాంజాల్ పట్టణ సిపిఎం కమిటీ అధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన తెలియజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో బిజెపి ఎంపీ ఇచ్చిన పాసులతో పార్లమెంటులోకి చొరబడి పొగ బాంబులు వేయటం దేశభద్రతపై నిరసన తెలుపడం జరిగిందని, అదేవిధంగా పార్లమెంటు బయట కూడా నిరసన తెలుపడం జరిగింది. దీన్ని వ్యతిరేకిస్తూ దీనిపైన సమగ్ర విచారణ జరపాలని పార్లమెంటు భవనానికి భద్రత ఈ దేశానికి భద్రత కల్పించాలని ఇండియా కూటమి సభ్యులు కాంగ్రెస్, వామపక్షాలు ఇతర పార్టీల సభ్యులు ప్రశ్నించినందుకు 146మంది పార్లమెంట్ సభ్యులను ప్రజా స్వామ్యానికి విరుద్ధంగా ప్రతి పక్ష పార్టీల యంపిలను శీతాకాల సమావేశాల వరకు సస్పెండ్ చేస్తున్నట్టుగా స్పీకర్ ప్రకటించడం అన్యాయమని, పార్లమెంటులోకి పోవడానికి ఎవరైతే పాసులు ఇచ్చారు, లోనికి ఎవరు అనుమతించారో వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఎలా వచ్చారని ప్రశ్నించిన ప్రతి పక్షాలను సస్పెండ్ చేయటం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. వెంటనే 146 మంది ప్రతి పక్ష పార్టీల ఎంపిల సస్పెన్షన్ ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యదర్శి డి.కిషన్, నాయకులు ఎం.ప్రకాష్ కారత్, బి.శంకర్, ఎం.సత్యనారయణ, ఆశీర్వాదం, శారద, ఎం.యాదగిరి, బి.శంకరయ్య, పంది జంగయ్య, శ్రీధర్, హనుమంత్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, బీరప్ప, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అన్ని వర్గాలు అభివృద్ధి : రాష్ట్ర మంత్రి సీతక్క



మినీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క

**మల్కాజిగిరి, డిసెంబర్ 21 ప్రభాతవార్త :** పేదప్రజల సంక్షేమం కోసం, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పాటు పాటుపడుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. శుక్రవారం మ్యాగ్న గ్రూప్ ఛైర్మన ఛైర్మన్ ఏ.ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ప్రేమ, శాంతితోనే ప్రజల ప్రజలు దేవుడు అయ్యాడన్నారు. అన్ని మతాలు, అన్ని వర్గాల సంస్కృతి సంప్రదాయాలను గౌరవించే సాంప్రదాయం తెలుగు ప్రజల్లో ఉందన్నారు. ప్రతి ఒక్కరు ప్రేమతో ఏదైనా సాధించవచ్చన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని ప్రతి ఒక్క రికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలందరికీ అందజేస్తామన్నారు. మినీ క్రిస్మస్ వేడుకల్లో మ్యాగ్న గ్రూప్ ఛైర్మన్ ఏ.ప్రతాపరెడ్డి, ఎండి జాషువారెడ్డిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

## అన్ని దానాలకన్నా అన్నదానంగొప్ప : ఉప్పల

### 13 సంవత్సరాలుగా అయ్యప్పస్వాములకు అన్నదానం



అన్న ప్రసాదం అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మొగుళ్ళపల్లి ఉపేందర్‌గుప్తా

**ఎల్‌బినగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** అయ్యప్పస్వామి భక్తులకు మహా అన్న ప్రసాదం మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తా ఆధ్వర్యంలో గత 13 సంవత్సరాలుగా అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదాన కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి నిర్వాహకుడు ప్రేమ్‌కుమార్‌గుప్తా ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదాన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పాల్గొని అయ్యప్ప స్వామి భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. కొత్తపేట మారుతినగర్ ఆంజనేయస్వామి ఆలయంలో 41 రోజులుగా వేలాదిమంది అయ్యప్ప మాలధరణ ధరించిన అయ్యప్ప స్వామి భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించి అయ్యప్ప స్వాముల కలిసి ఉప్పల శ్రీనివాస్‌గుప్త సహాఫంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా మొగుళ్ళపల్లి ఉపేందర్‌గుప్తా ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమంతో ఎంతో సేవ చేస్తున్నడని కొనియాడారు. అన్ని దానాలకన్నా అన్నదానం ఎంతో గొప్పదన్నారు. అదేవిధంగా అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అధ్యక్షులు ప్రేమ్‌కుమార్‌గుప్తా ఆధ్వర్యంలో ఎంతో మంది అయ్యప్ప స్వాముల 41 రోజుల భిక్ష కార్యక్రమం బ్రహ్మాండంగా జరుపుతున్న ప్రేమ్ కుమార్‌గుప్తను అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు మొగుళ్ళపల్లి ఉపేందర్‌గుప్తా, వెంకన్న, నారాయణ, రాజు, పవన్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## లార్డ్స్ పాఠశాలలో గణిత దినోత్సం..

### ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనాంశాలు



విద్యార్థులు ప్రదర్శించిన గణిత సంబంధిత అంశాలు

**సరూర్‌నగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడు డాక్టర్ శ్రీనివాస అయ్యంగార్ రామానుజన్ 136వ జయంతి సందర్భంగా బడంగ్‌పేట్‌లోని లార్డ్స్ హై స్కూల్‌లో శుక్రవారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మాథ్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులు గణితానికి సంబంధించిన అంశాలపై పలు నమూనాలను ప్రదర్శించి సందర్శకులకు వివరించారు. అయితే విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనాంశాలు, వారు వివరించిన తీరు విశేషంగా ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను లార్డ్స్ గ్రూపు స్కూల్స్ ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బెర్ల శ్రీనివాస్‌రెడ్డిలు తిలకించి విద్యార్థులను ప్రశంసించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు వారు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రామిడి సంతోష్, ఇంఛార్జి రేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మాస్టర్ చందర్‌రావుకు తీగల అభినందనలు



డాక్టరేట్ పొందిన కరాటే మాస్టర్ చందర్‌ను అభినందిస్తున్న తీగల కృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** గత రెండు దశాబ్దాలనుండి మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న కరాటే మాస్టర్ బి.చందర్‌రావు పలువురికి స్ఫూర్తిదాయకమని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే, టికెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ తీగల కృష్ణారెడ్డి ప్రశంసించారు. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుండి చందర్‌కు గౌరవ డాక్టరేట్ పురస్కారం లభించిన సందర్భంగా ఆయనను తీగల అభినందించారు. ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ సుమారు రెండు దశాబ్దాల కాలం నుండి మీర్‌పేట్, జిల్లెలగూడతో పాటు పలు ప్రాంతాల్లో వేల మంది విద్యార్థులకు స్వయం రక్షణ కోసం కరాటే తదితర మార్షల్ ఆర్ట్స్‌లో మంచి శిక్షణనిస్తున్న చందర్‌కు గౌరవ డాక్టరేట్ పురస్కారం లభించడం హర్షణీయమన్నారు.